

# నా కళ్ళతో నాన్న

- లిపి మల్లాది



ఆంధ్రుల ఆహ్లాద రచయిత మల్లాది వెంకట కృష్ణమూర్తిగారు ఇటీవల ఫేమిలీ ఆల్బమ్ పేరుతో సొంత అనుభవాలను రచనలో వ్రాశారు. వందల, వేల పాత్రలను సృష్టించిన మల్లాదిగారిని వాళ్ళ అమ్మాయి కళ్ళతో చూస్తే ఎలా ఉంటుంది? అందుకు సమాధానమే ఈ ధారావాహిక. మల్లాదిగారు, పద్మజగార్లకు ముగ్గురు సంతానం - కావ్య, ఊహ, లిపి. ముగ్గురూ అమెరికాలోనే ఉన్నత చదువులు చదివి ఉద్యోగాలు చేస్తున్నారు. చిన్నమ్మాయి లిపి, వాళ్ళ నాన్నగారి గురించి వ్రాస్తున్న ఈ సంఘటనలు పాఠకులకు ఆసక్తికరంగా ఉంటాయని ఆశిస్తున్నాం.

*(గత సంచిక తరువాయి)*

"**పుత్రోత్సాహము** తండ్రికి పుత్రుడు జన్మించినప్పుడె పుట్టదు" అని బద్దెన అన్నారు. చిన్నతనంలో క్లాస్ ఫస్ట్ వచ్చినప్పుడు, లేదా మెడల్ సంపాదించినప్పుడు తాను అమ్మాయి కావడంతో "పుత్రికోత్సాహం వచ్చిందా?" అని కావ్య అడిగేది. ఏదైనా సాధించినప్పుడు మేం ముగ్గురం అదే ప్రశ్న అడగడంతో 'పుత్రికోత్సాహం' మా ఇంట్లో వాడుక పదమైంది. ఎక్జామ్స్‌లో డిస్టింక్షన్, కాలేజీలో స్కాలర్‌షిప్, ప్రమోషన్, మొదలగున్నవి నాకన్నా ముందు కావ్య, ఊహ సంపాదించి మా అమ్మా, నాన్నలని సంతోషపరిచారు. "యా. ఆల్రెడి కావ్యా, ఊహ చేసారులే" అని మా అమ్మ మనసులో అనుకుంటున్న సంగతి తను "వెరీ గుడ్. బావుంది" అని నవ్వుతున్నా తన ముఖంలో తెలిసిపోతుంది.

"అబ్బో.. ఫస్ట్ క్లాస్" అని మా నాన్న అన్నప్పుడు మాత్రం కళ్ళలో కల్మషం లేని గర్వం కనబడుతుంది. కానీ నా జీవితంలో మొట్టమొదటిసారి కేవలం నేను మాత్రమే చేసిన గర్వించదగ్గ పని ఈ ధారావాహిక. "మీ అమ్మాయి బాగా రాస్తుందండి - అని ఫలానా చెప్పారు" అని నాతో అన్నప్పుడల్లా "పుత్రికోత్సాహం వచ్చిందా?" అని అడుగుతాను. ఎన్నడూ విసుక్కోకుండా "ఆఁ వచ్చింది" అని చిరునవ్వుతో మా నాన్న సమాధానమిస్తారు. "వచ్చిందిలే బడాయ్ బచ్చా, కానీ పాపం ఊహ గురించి విలన్‌లా రాయకు. అది చాలా ఫీల్ అవుతుంది" అని మా అమ్మతో పాటు నా ఫ్రెండ్స్, కొంతమంది చుట్టాలు కూడా అన్నారు. కనుక ఈ సంచికలో ఊహని హీరోలా చూపకపోయినా నా వల్ల తను ఎన్ని అభాండాలు మోసిందో, ఎన్ని ఇబ్బందులు పడిందో తెలియజేస్తాను.

మా నాన్న ప్రయాణం ముగించి ఇంటికి వచ్చిన ప్రతీసారి మా కోసం కొన్న బొమ్మలు, కానుకలు మా ముందు పరిచేవారు. తిరిగి మా గదిలోకి వచ్చేలోగా కావ్య, ఊహ "ఈ బొమ్మ బావుంది. ఆ బొమ్మ బావుంది" అని మాట్లాడుకునేవారు. ఆఖరిదాన్ని అవ్వడంతో ముందుగా నన్నే ఎంచుకోమనేవారు. కావ్య, ఊహ బావున్నాయి అనుకున్న బొమ్మలని నేను ఏరుకునేదాన్ని. దాంతో ఊహకి నల్ల టెడ్డీబేర్లు మాత్రమే మిగిలేవి. మా మధ్య తగాదా రాకుండా పంచుకోవడం చిన్నతనం నుండే అలవాటు చెయ్యాలని ఒకే రకం బొమ్మలు తెచ్చేవారు

కాదు. "పాపం ఊహాకి అన్నీ నల్ల టెడ్డీ బేర్లే ఉన్నాయ్. ఒకటి ఎక్స్ఛేంజ్ చేస్తావా లిపి?" అని కావ్య అడిగిన సంఘటన నాకు గుర్తుంది. "నాకేం అక్కర్లేదు. నా నల్లవే బావున్నాయి" అని ఊహ కోపంగా వెళ్ళిపోయింది.

అదే అంశం గమనించిన మా నాన్న "లిపి, ఊహాకి కొన్ని రోజులు నీ బొమ్మలిచ్చి ఊహావి నువ్వు తీస్కో" అన్నారు.

"ఊహాకి నల్ల టెడ్డీ బేర్లే ఇష్టమట" అని నేను అక్కడ నుండి పరుగెత్తాను.

"ఓ.. ఔనా" అని మా నాన్న అప్పటినుండి ఊహాకి కేవలం నల్లని బొమ్మలే కొన్నారు.

నాకు ఆరేళ్ళున్నప్పుడు కంప్యూటర్‌లోని డూం, హెరిటిక్ అనే ఆటలు ఎక్కువగా ఆడేవాళ్ళం. ఇప్పటికీ అవే మా ఫేవరెట్స్. (మళ్ళీ) నేనే చిన్నపిల్లని అవ్వడంతో ముందు నేను గంట ఆడుకున్నాకే ఊహని ఆడనిచ్చేవారు. (కావ్య ఎప్పుడూ ఆడేది కాదు) ఆ ఆటల్లోని రాక్షసులను చంపేందుకు నేను ఇష్టపడేదాన్ని కాదు. వారు నన్ను చంపే ప్రయత్నంలో ఉండగా ఇంట్లో అందరూ హడలిపోయేలా భోరున ఏడ్చేదాన్ని. "నువు జరుగు, నేనాడతా" అని ఊహ ఎంత బతిమాలినా ఒప్పుకునేదాన్ని కాదు. మా నాన్న రాస్తున్న నవలని సగంలోనే వదిలి పెట్టి "ఏం ఫరవాలేదు. అవి నిజం కాదు. కేవలం ఆటలో బొమ్మలే" అని ప్రతీసారి ఓపికగా నాతో ఆడించేవారు. కొన్నిసార్లు నేను మరీ ఏడవడంతో ఆయనే నా ఆటని పూర్తి చేసేవారు. "నాన్న ఆడారు. నేను కాదు" అని ఊహ ఆడుకోవాల్సిన సమయాన్ని కూడా నేనే వాడుకునేదాన్ని. బహుశా నా పిల్లలు ఆడకుండా రాక్షసులని చంపాలి అని ఏడిస్తే "అయితే ఈ ఆట నీకు కరెక్ట్ కాదు" అని కంప్యూటర్ జోలికి వెళ్ళనివ్వను కాబోలు. ఈ విషయంలో మా నాన్న పోలిక కావ్య, ఊహాలిద్దరికీ వచ్చింది.

ఊహ చిన్నప్పుడు హోలీ ఆడుతూ పొరపాటున ఓ కుక్కమీద హోలీ రంగునీళ్ళు చల్లిందట. ఆ కుక్క వెంట పడడంతో భయపడి పరుగెత్తి ఎవరో ఇంట్లోకి దూరి మంచం కింద దాక్కుందంట. ఎంతసేపటికీ ఊహ ఇంటికి రాకపోవడంతో మా నాన్న బజారులన్నీ వెతికి ఊహని ఎత్తుకుని ఇంటికి తెచ్చారు. ఆ దెబ్బకి ఓ నెలరోజులపాటు ఇల్లు దాటడానికి ఊహ భయపడిందట.

చిన్నప్పుడు నేను 'దెయ్యం' సినిమా చూసి బాగా భయపడినప్పుడు అందులో కొన్ని సంఘటనలు వాడుకుని కావ్య, ఊహ నన్ను దూరంగా ఉంచేవారు. "లిపి, పైకి రాకు. ఇక్కడ గోడలోంచి చేతులొచ్చాయి" అని ప్రతీసారి అనడంతో నేను పట్టపగలు కూడా పైకెళ్ళడానికి భయపడేదాన్ని. అప్పుడు మా నాన్న ఇచ్చిన ధైర్యానికే ఈ రోజుకీ వంటరిగా ఉండడం, చీకటిలో నడవడం, దయ్యం సినిమాలు చూడ్డం వల్ల నాకు భయం కలగదు. పాత సినిమాల్లో దయ్యాలు స్కిన్ టైట్ వైట్ కలర్ డ్రస్ వేసుకుని పొడుగు జుట్టుతో ఉండడం నాకూ, ఊహాకి చాలా నవ్వొచ్చే విషయం. మా బంధువుల్లో ఒకమ్మాయిని 'అచ్చు నీ లాగే ఉంది' అన్నామని ఆ అమ్మాయి అలిగి పెద్దగొడవ చెయ్యడం కూడా మాకు ఈ రోజుకీ నవ్వు తెప్పిస్తుంది.

ఊహ సైకిల్ తొక్కడం నేర్చుకున్న కొత్తల్లో తనకి సైకిల్ దిగడం వచ్చేది కాదట. ఇంటి చుట్టూ రౌండ్లు కొడుతూ "అమ్మా, అమ్మా" అని అరిచేదట. లోపల టీవీ శబ్దాన్ని దాటి ఊహ గొంతు వినపడ్డాక మా అమ్మ బయటికి వచ్చి ఊహ దిగడానికి సహాయపడేంత వరకూ అలా సైకిల్ తొక్కుతూనే ఉండేదట. నాకు సైకిల్ నేర్పే బాధ్యతని మా అమ్మ, నాన్న ఊహాకి అప్పగించారు. "లిపి, సైకిల్ మీదనించి కిందపడితే సైకిల్ తొక్కడం వస్తుందట" అని నేను పడ్డ ప్రతిసారీ ప్రోత్సహించినా రాకపోవడంతో తను నేర్పలేనని ఆ బాధ్యతని కావ్యకి అప్పగించింది. వాళ్ళు ఎన్నిగంటలు వృధా చేసుకున్నా సైకిల్ తొక్కడం మాత్రం నేను స్వతహాగానే నేర్చుకున్నాను.

ఓ ఏడాది మేలో ఊహ పుట్టిన రోజున ఉదయం నేను ఇంటి చుట్టుపక్కలవారందరికీ 'ఇవాళ్ళ నా బర్త్‌డే' అని చాక్లెట్లు పంచాను. 'ఒక్కదానివే వచ్చావేంటి? కొత్త బట్టలు వేసుకోలేదే?' వంటి ప్రశ్నలకు నా మౌనమే సమాధానం చెప్పింది. నేను ఇంటికి తిరిగి వచ్చిన గంటకి ఊహ శుభ్రంగా తలస్నానం చేసి తయారయ్యి కావ్యని తోడు తీసుకుని చాక్లెట్‌లతో బయలుదేరింది. "అదేంటి? ఇందాకే మీ చెల్లి వచ్చిందే మీ ఇద్దరూ ఒకే రోజు పుట్టారా? కలిసి రావాల్సిందిగా?" అని అంతా అడిగినప్పుడు అయోమయంగా "ఇవాళ నా బర్త్‌డే మా చెల్లి అక్టోబర్‌లో పుట్టింది" అని ప్రతి ఒక్కరికీ చెప్పిందట పాపం.

ఇంట్లో వస్తువులు ఎక్కువగా ఊహ వల్ల పాడవడంతో ఏదైనా విరిగినా, లేదా పాడైనా "ఎవరు చేసారు?" అని అడగకముందే "ఊహా ఎందుకు ఇలా చేసావు?" అని ప్రశ్నించేవారు. ఒకసారి నా వల్ల విరిగిపోయిన ఫ్లవర్ వేజ్, పాడైన రిమోట్ కూడా ఊహ నిర్వాకమనే అందరూ భావించారు.

అలాగే, సాయంత్రాలు నేను "నాన్నా..నాన్నా" అని పెద్ద గొంతుతో పిలవగానే "ఊహా, లిపిని ఇబ్బంది పెట్టకమ్మా" అని మా నాన్న అనేవారు. దాంతో ఊహ నా గదిలోంచి బయిటకి వెళ్ళిపోయేది. నాన్న ఇంట్లో లేని సమయంలో "అమ్మా ఊహని తీసుకుపో" అని అరిచేదాన్ని. "నేనేమైనా పిల్లినా, కుక్కన తీసుకుపోడానికి? మంచిగా చెప్పు" అని బాధపడేది.

ఊహని నేను ఎక్కువగా విసిగించింది మా అమ్మ ఊళ్ళో లేని సమయంలో "లిపి ఆకలేస్తుంది. ఏమైనా వండవా?" అని ఊహ అడిగిన వెంటనే ఏ రోజూ నేను వంట చెయ్యలేదు.

"ఫైవ్ మినిట్స్ అయ్యాక రా" అనేదాన్ని. ఊహ కొంచెంసేపయ్యాక వచ్చి "లిపి, ఫైవ్ మినిట్స్ అయ్యింది" అనేది.

"నేను ఫైవ్ మినిట్స్ తర్వాత రమ్మంటే నువ్వు ఫోర్ మినిట్స్ ఫార్టీ సెకెండ్స్‌కి వచ్చావు. ఇంకో త్రీ మినిట్స్ వెయిట్ చెయ్" అనేదాన్ని. ఆ తర్వాత టెన్ మినిట్స్, ఎయిట్ మినిట్స్, టూ మినిట్స్ అంటూ గంటపైనే వెయిట్ చేయించేదాన్ని. (వంట పూర్తయ్యాక కథ మరోలా ఉండేది.)

"కనీసం కాఫీ అయినా కలుపుకోవడం నేర్చుకోవే" అని మా అమ్మ ఎన్నిసార్లు చెప్పినా వినిపించుకోని ఊహ ఇప్పుడు అనేక వంటకాలు అద్భుతంగా చెయ్యడం మా అందరికీ ఆశ్చర్యంగానూ, గర్వంగానూ ఉంది.

కావ్య జీ.ఆర్.ఈకి చదువుకునే రోజుల్లో నాకు సెలవులు. తను రాత్రంతా కష్టపడి చదువుతుందని నేను మధ్య రాత్రి తనకి ఆకలి వేసేలోపు ఏదైనా వండిపెట్టేదాన్ని. కేవలం బంగాళదుంప, లేదా ఎగ్స్ తినే ఊహకి మా అమ్మ ఒకరోజు రాత్రి స్క్రాంబుల్డ్ ఎగ్ చేసి పెట్టింది. "అమ్మా ఇది బాలేదు" అని ఊహ అంది.

"ఇన్ని కూరలు, పచ్చళ్ళు, పప్పు ఉన్నా ఏదీ తినవు. నీకోసం ప్రత్యేకంగా వండాలి. దానికి కూడా వంకలు పెడతావ్" అని మా అమ్మ కోప్పడింది.

"కాదమ్మా ఇది నిజంగా బాలేదు. ఏదో టేస్ట్ వస్తుంది" అని చెప్పింది ఊహ.

మా అమ్మ ఏదో అనబోతుండగా "అమ్మా, ఫ్రిడ్జ్‌లో గిన్నెలో ఉన్న ఎగ్స్‌తో వండావా?" అని అడిగాను.

"ఔను. పాడైపోతుందేమో అని వండేసాను." అని మా అమ్మ అంది.

"రాత్రి అక్కకి ఆకలేస్తుందంటే ఎగ్స్‌లో పాలు, పంచదార కలిపి ఏదో వండాను. మిగిలిపోయింది ఇవాళ వండచ్చని ఫ్రిడ్జ్‌లో పెట్టాను. నువ్వు దాంతోనే ఊహకి కర్రీ చేసావు" అని విడమరిచి చెప్పగానే కావ్యా, మా నాన్న చాలాసేపు నవ్వారు.

"నువ్వెప్పుడూ అంతే. బాలేదన్నా వినిపించుకోకుండా తినమన్నావు" అని ఊహ కుడా నవ్వింది. అసలు పంచదార, పాలు, ఉల్లిపాయలు, ఉప్పూ, కారం కలిపి చేసిన ఎగ్ కర్రీని ఊహ ఎలా తినగలిగిందో నేను ఇప్పటికీ ఊహించుకోలేను.

మరోసారి నా ఫ్రెండ్ పెట్రోల్ నింపడానికి వాడిన బాటిల్‌ని మా ఇంట్లో వదిలేసాడు. అది తెలీక అందులో మా అమ్మ మంచినీళ్ళు నింపి ఫ్రిడ్జ్‌లో పెట్టింది. పాపం ఊహ ఆ నీళ్ళు తాగి "ఈ నీళ్ళు బాలేవు" అంది.

"బాటిల్‌లో నీళ్ళు నింపమంటే నింపవు. నేను నింపిన వాటికి వంకలు పెడతావు. నీళ్ళు బావుండకపోవడమేంటి?" అని అమ్మ కోపంగించుకుంది.

భయపడుతూ ఊహ నా దగ్గరికి వచ్చి "లిపి, ఒకసారి ఈ వాటర్ తాగు. టేస్ట్ బానే ఉందో లేదో చెప్పవా ప్లీజ్" అంది.

ఆ బాటిల్ గుర్తుపట్టి, "ఇది సోఫా ప్రక్కన ఉన్న బాటిలా?" అని అడిగాను.

మా అమ్మ "ఔనంది."

"నాకు పెట్రోల్ వాసన ఇష్టమని పొద్దున ఒక ఫ్రెండ్ నాకోసం తెచ్చాడు" అని చెప్పి నవ్వాను. ఊహ కూడా కోప్పడకుండా నవ్వింది.

మా అమ్మ సైకాలజీ చదవడం వల్ల మిడిల్ చైల్డ్ సిన్‌డ్రోం గురించి బాగా తెలుసు కాబట్టి ఊహ అలా ఇబ్బంది పడకూడదని నిర్ణయించుకుంది. చిన్నతనంలో నాదే రాజ్యమైనా నాకు పదమూడేళ్ళు నిండేసరికి ఊహదే పెత్తనం. తప్పు ఎవరిదైనా 'పాపం ఊహని అరవకు' అని మా అమ్మ ఈ రోజుకీ అంటుంది. ఊహని ఇంట్లో ఆఖరి పిల్లలా చూడ్డంతో నేను అక్కలా ప్రవర్తించేదాన్ని. "నేను అక్కనా, నువ్వు అక్కవా అని డౌట్ వస్తుంది" అని ఊహ చాలాసార్లు అంది. వయసులో నా కన్నా పెద్దదైనా, ఓ కూతురున్నా, మా అమ్మకి ఊహ ఎప్పుడూ అమాయకురాలే.

ఊహ నాబుక్స్ లాక్కున్నప్పుడు, జుట్టులాగినప్పుడు స్పందించినట్టే "లిపి, రేపు వెళ్ళు. ఇవాళ్ళ మా ఇంట్లోనే ఉండు" అన్నప్పుడు స్పందించడం మా ఇంట్లో ఎవ్వరికీ నచ్చదు.

"ఊహకి నువ్వంటే చాలా ఇష్టమమ్మా. అలాంటి లవ్ అందరికి దొరకదు. అది నీతో టైం స్పెండ్ చెయ్యాలనుకున్నప్పుడు విసుక్కోకు. యూ విల్ రిగ్రెట్" అని మా నాన్న అనేకసార్లు చెప్పారు. కానీ కొన్ని బంధాలు నవ్వులు, సరసాలతో కూడుకుంటే కొన్ని బంధాలు చిరాకులు, పరాకులతో కూడి ఉంటాయి.

"లిపి రావచ్చుగా" అని ఊహ ప్రేమని వ్యక్తం చేస్తే, "కుదరదు. పనుంది" అని నేను ప్రేమని వ్యక్తం చేస్తాను. ఎందుకంటే కలిసిన ప్రతిసారీ ఊహని తెలిసో తెలియకో నొప్పించడం నేను గమనించాను. 'తెలిసీ అలా చెయ్యడం ఎందుకు?' అని అనుకుంటున్నారా? అందుకు నా సమాధానం 'టాం ఎండ్ జ్రరీ' ఎప్పుడూ కొట్టుకుంటూనే స్నేహాన్ని కొనసాగిస్తాయి.

*(నాన్నకబుర్లు మరిన్ని వచ్చేనెలలో)*

Click here to share your comments on this story